
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

శుక్రవారం 19 జనవరి 2024







తాత్సారం

'పంచాయతీ' ఎన్నికలు ఇప్పట్లో లేనట్టే..!

- ముగియనున్న పాలక మండళ్ల పదవీకాలం
- ఎలక్షన్ల నిర్వహణకు ఏర్పాట్లు చేయని ప్రభుత్వం
- జూన్‌లో పరిషత్తు ఎన్నికలతో కలిపి చేపట్టేందుకు మొగ్గు!
- ఆరు నెలల వరకు ప్రత్యేక అధికారులను నియమించే అవకాశం

భూపాలపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు ఆలస్యంగా జరగనున్నాయని తెలుస్తోంది. పాలక మండళ్ల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగియనుండగా ఇప్పటి వరకు ఎలాంటి ఏర్పాట్లు జరగడం లేదు. మరో రెండు వారాల సమయమే ఉన్నప్పటికీ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించడంపై ఆసక్తి చూపడం లేదు. మరో ఆరు నెలల వరకు ప్రత్యేక అధికారులను నియమించేందుకు జాబితా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. జూన్‌లో పరిషత్తు ఎన్నికలతోపాటే పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

అప్పటి ఉమ్మడి భూపాలపల్లి జిల్లాలోని 415 పంచాయతీలకు 2019 జనవరి 1న ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యింది. జనవరి 21, 25, 30 తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. అన్ని పంచాయతీలకూ అదే రోజు ఫలితాలు వెలువడినప్పటికీ ఫిబ్రవరి 2న సర్పంచులు, వార్డుసభ్యులు బాధ్యతలు చేపట్టారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 1తో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ముగుస్తుంది. దీనికి ఇంకా రెండు వారాల సమయం కూడా లేదు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సుముఖంగా లేదనే టాక్ వినిపిస్తోంది.

గత పంచాయతీ ఎన్నికల అనంతరం 2019ఫిబ్రవరి 19న భూపాలపల్లి జిల్లా నుంచి ములుగు విడిపోయి కొత్త జిల్లాగా ఏర్పడింది. రెండు జిల్లాలుగా విభజన జరిగింది. భూపాలపల్లి జిల్లాలో 241, ములుగు జిల్లాలో 174 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలంలోని 23 గ్రామాలు షెడ్యూల్ ఏరియాలోకి వస్తాయని గత ఏడాది జూలై 25న హైకోర్టు తీర్పు చెప్పింది. దీంతో ఈ గ్రామాలు మొత్తం కూడా ఆదివాసీలకే రిజర్వ్ చేయనున్నారు. 2006లో మంగపేట మండలంలో చివరిసారి ఎన్నికలు జరిగాయి. తాజాగా కోర్టు తీర్పు నేపథ్యంలో ఈసారి నిర్వహించాల్సి ఉంది.

పరిషత్తుతో పాటేనా..?

పార్లమెంట్ ఎన్నికలు కూడా ఈ ఏడాదే జరగనున్నాయి. మార్చి లేదా ఏప్రిల్‌లో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. తెలంగాణలో మేలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల్లో ఈ రెండు, మూడు నెలల్లో న్విహించడం సాధ్యం కాకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మరో ఆరు నెలల పాటు పంచాయతీ ఎన్నికలు వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే జూన్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తి కానుండటంతో పరిషత్తు ఎన్నికలతోపాటే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారా.. లేదా వేర్వేరుగా నిర్వహిస్తారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

రిజర్వేషన్లు మారుతాయా..?!

పంచాయతీల రిజర్వేషన్‌ను పదేళ్లపాటు ఉండేలా 2018లో గత ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో గత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే.. గత ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంపై కొత్త ప్రభుత్వం అసంతృప్తిగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఐదేళ్లకోసారి రిజర్వేషన్లు మార్చే పాత పద్ధతి వైపే కొత్త ప్రభుత్వం మొగ్గు చూపుతోందనే టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన బీసీ రిజర్వేషన్లు ఖరారు కావాల్సి ఉంది. రాబోయే రెండు, మూడు నెలల్లో పంచాయతీల్లో రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పాతవి రద్దు చేసి కొత్త రిజర్వేషన్లతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక అధికారుల నియామకానికి కసరత్తు

పంచాయతీ పాలక మండళ్ల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగుస్తుండటంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయంపై దృష్టిసారించింది. భూపాలపల్లి జిల్లాలో 241 గ్రామపంచాయతీలు, ములుగు జిల్లాలో 174 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. మేజర్ గ్రామ పంచాయతీలకు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, సూపరింటెండెంట్ స్థాయి అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించే అవకాశం ఉంది. ఇతర గ్రామ పంచాయతీలకు రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులను నియమించనున్నారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులు జాబితా సిద్ధం చేస్తున్నారు. అయితే.. ప్రస్తుత సర్పంచులు మాత్రం తమ పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. 2020, 2021 సంవత్సరాల్లో కరోనా కారణంగా పంచాయతీలకు ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని అంటున్నారు. ఇప్పటికీ ప్రతి పంచాయతీ సర్పంచ్‌కూ లక్షల్లో బిల్లులు రావాల్సి ఉందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ప్రత్యేక అధికారుల పాలన కంటే తమకు అవకాశం ఇస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అంటున్నారు. అయితే.. ప్రభుత్వం సర్పంచుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటుందా.. లేక ప్రత్యేక అధికారుల నియామకం వైపే మొగ్గు చూపుతుందా? అనే చర్చ జరుగుతోంది. ప్రస్తుత సర్పంచుల్లో ఎక్కువ శాతం బీఆర్ఎస్ మద్దతుదారులు ఉండటంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల నియామకం వైపే మొగ్గు చూపొచ్చనే టాక్ కూడా వినిపిస్తోంది.

మేడారంలో ఆదివాసీల చట్ట ఉల్లంఘనను అరికట్టాలి

గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

తాడ్వాయి, జనవరి 18: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో ఆదివాసీల చట్టాలను ఉల్లంఘించడం పరిపాటిగా మారిందని, దీన్ని అరికట్టాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. సమ్మక్క-సారలమ్మ జాతరను ఆదివాసీలు సంస్కృతీ సంప్రదాయాలు, భక్తిశ్రద్ధల మధ్య జరుపుకునేవారని అన్నారు. ప్రస్తుతం ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు, కట్టుబాట్లను పక్కనబెట్టి వలస గిరిజనేతరులు మేడారంలో వారి సిద్ధాంతాలను అమలుచేసే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నాలుగు దశాబ్దాల కాలంలో మేడారంలో పూర్తిగా ఆదివాసీలు ఉండేవారని, ఇప్పుడు చుట్టూ వలస గిరిజనేతరులు ప్రవేశించారని అన్నారు. అమాయక ఆదివాసీల భూములను వ్యాపారం పేరుతో కొనుగోలు చేసి వారిని ఇంకా అడవుల్లోకి నెట్టివేస్తున్నారని ఆరోపించారు. మహాజాతర జరిగే సమయంలో ప్రభుత్వం, అధికారులు హడావిడి చేస్తున్నారే తప్ప గిరిజనులను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఐదో షెడ్యూల్ ప్రాంతమైన ఇక్కడ గిరిజనేతరుల వ్యాపారాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కణితి వెంకటకృష్ణ, పూనెం ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు లబ్ధిదారుల నిరసన

నిధులు విడుదల చేయాలని డిమాండ్

పెట్రోల్ బాటిళ్లతో వాటర్ ట్యాంకు ఎక్కి ఆందోళన

ములుగులో నాలుగు గంటలపాటు ఉద్రిక్తత



ములుగులో నిరసన తెలుపుతున్న దళితబంధు లబ్ధిదారులు

ములుగు, జనవరి 18: దళితబంధు నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు ములుగు లో గురువారం నిరసనకు దిగారు. పెట్రోల్ బాటిళ్లతో వా టర్ ట్యాంక్ ఎక్కి ఆందోళనకు దిగారు. స్పష్టమైన హామీ ఇవ్వకుంటే ఆత్మాహుతి చేసు కుంటామని హెచ్చరించారు. దీంతో నాలుగు గంటలపాటు ఉద్రిక్త వాతావరణం చోటుచే సుకుంది. దళితబంధు సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కోగిల మహేష్ ఆధ్వర్యం లో కలెక్టరేట్ ముట్టడికి పలువురు లబ్ధిదారులు ప్రయత్నించారు. ఈక్రమంలో మధ్యాహ్నం 12 గంటల సమయంలో ములుగు మండలానికి చెందిన కవ్వంపల్లి బాబు, గోవిందరావుపేటకు చెందిన మీదిగొండ రాజేంద్రప్రసాద్, ఊట్ల మోహన్ చేతిలో పెట్రోల్ బాటిళ్లతో కలెక్టరేట్ ఆవరణలోని ఓవర్ హెడ్ ట్యాంక్ పైకి ఎక్కారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి వచ్చి హామీనివ్వాలని, లేదంటే పెట్రోల్

మిగతా 8వ పేజీలో...

భూకబ్జాలపై సీఎంకు కౌన్సిలర్ లేఖ

మాజీ ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులపై కేసు నమోదు

భూపాలపల్లిటౌన్, జనవరి 18: భూపాలపల్లిలో జరుగుతున్న భూకబ్జాలపై ఓ కౌన్సిలర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. దీంతోపాటు ప్రభుత్వ కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరేకు ఫిర్యాదు చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులపై కేసు నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది.

భూపాలపల్లి పట్టణంలోని పుల్లూరిరామయ్యపల్లి శివారు చెరువు శిఖం భూమిలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తన అనుచరులతో భూకబ్జా చేశారని ఆరోపిస్తూ కౌన్సిలర్ నాగవెల్లి సరళ, ఆమె భర్త రాజలింగమూర్తి ఫిర్యాదు చేశారు. అలాగే పట్టణ పరిధి కాశీంపల్లిలోని కొడిశలకుంటలో ఉన్న 40 ఎకరాల భూమిని ఓ మాజీ నక్సలైట్, మాజీ ఎమ్మెల్యేకు ప్రధాన అనుచరుడిగా పనిచేస్తున్న వ్యక్తి భూకబ్జా చేశారని, ఈ క్రమంలో గ్రామస్థులు అడ్డగించారని తెలిపారు. కొంపల్లి శివారు సర్వే నంబరు 186/2లోని బీసీకాలనీలో ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కబ్జా చేశారని ఆరోపించారు. సర్వే నంబరు 186/1లో సుమారు 36 మంది పేదలు భూములు కొనుగోలు చేసి నివాసం ఏర్పర్చుకుంటే హరిబాబు అనే వెంకటరమణారెడ్డి అనుచరుడు దానిని కూడా కబ్జా చేశారని పేర్కొన్నారు. సర్వే నంబరు 323/2లో 20గుంటల భూమిని కబ్జా చేసి ఓ న్యాయవాదికి అన్యాయం చేయాలని ప్రయత్నిస్తు న్నారని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన సతీమణి వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతితో పాటు తనయుడు గౌతంరెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, కౌన్సిలర్ హరీశ్‌రెడ్డిపై ఈనెల 16న కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిరూపిస్తే జైలుకు వెళ్లేందుకు సిద్ధం : గండ్ర వెంకటరమణారెడ్డి

తనపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించే కుట్రలు జరుగుతున్నాయని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. భూకబ్జాలకు పాల్పడినట్టు నిరూపిస్తే జైలుకు వెళ్లేందుకు తాను సిద్ధమేనని అన్నారు. హైదరాబాద్‌లో ఆయన ఈ మేరకు గురువారం మాట్లాడారు. పోలీసులు నిబంధనలకు లోబడి పనిచేయాలని, మంత్రులు, ఎమ్మెల్యేలు ఏది చెబితే అది విని చర్యలు చేపట్టడం సబబుకాదని హితవు పలికారు. తనపై, తన కుటుంబ సభ్యులు, అనుచరులపై ఒక రౌడీషీటర్‌తో ఫిర్యాదు చేయించి కేసు నమోదు చేయడం సబబు కాదన్నారు. భూపాలపల్లిలో ఆలయాన్ని నిర్మించిన తనపై స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో నోటీసులు ఇచ్చారని, ఈ క్రమంలో హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నామని తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, ఆలయం అన్నీ ఒకే సర్వే నంబర్‌లో ఉన్నాయని స్పష్టం చేశారు. అది ఆలయం ఆస్తి తప్ప తనది కాదని తేల్చి చెప్పారు.

సర్పంచ్‌లను పట్టించుకోని బీఆర్ఎస్

గత ప్రభుత్వం వారిని అప్పులపాల్జేసింది

రూ.120 0కోట్ల పంచాయతీ బిల్లులు పక్కదారి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న కలెక్టర్, సర్పంచ్, ఉపసర్పంచ్

ములుగు, జనవరి 18: గత బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లను పట్టించుకోలేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. బిల్లులు చెల్లించకుండా అప్పులపాల్జేసిం దని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. ములుగు గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గురువారం సీతక్కను సన్మానించారు. స్థాని క పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్య క్రమంలో సర్పంచ్ బండారు నిర్మల, ఉపసర్పంచ్ వంగ సుమలత, వార్డు సభ్యులు మంత్రిని శాలువాలు, పూల మాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.1,200 కోట్ల గ్రామపంచాయతీ నిధులను పక్కదారి పట్టించిందని ఆరోపించింది. ఈవిషయంపై అసెంబ్లీలో ప్రశ్నిస్తే తమ నోళ్లు నొక్కారన్నారని మండిపడ్డారు. బిల్లులను సక్రమం గా విడుదలచేస్తే పల్లెల్లో మరింత అభివృద్ధి జరిగి ఉండేదన్నారు. పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం కూడా ముగింపు దశకు వచ్చిన నేపథ్యంలో ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి బిల్లులు విడుదల చేయిస్తా నని హామీనిచ్చారు. ములుగును ఎడ్యుకేషన్, టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తానని అన్నారు. జిల్లాకేంద్రంలో మోడల్ మార్కెట్, బస్టాండును నిర్మిస్తామని తెలిపారు. మేడారం జాతర ముగిసిన వెంటనే పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ములుగు పట్ట ణాన్ని అభివృద్ధిలో వెలిగిస్తామని, రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తామని తెలిపారు.

మేడారం భక్తులకు మెరుగైన వసతి

మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను ఘనంగా జరిపిస్తామని, భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తా మని మంత్రి చెప్పారు. దూరప్రాంతాల నుంచి వనదే వతలను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సేవ చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. తాను పేదరికాన్ని అనుభవించానని, ఎస్టీ హాస్టల్‌లో ఉండి చదువుకున్నానన్నారు. కరోనా కష్టకా లం, గోదావరి వరదల సమయంలో ప్రాణాలకు తెగిం చి పేదలకు సేవచేశానని, తాను తాకని గడప, పలకరించని కుటుంబం లేదన్నారు. ఎన్నికల సమయంలో కొందరు తనపై తప్పుడు ప్రచారం చేయడం బాధ కలి గించిందని సీతక్క అన్నారు. అయినా పేదల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. పంచా యతీ పారిశుధ్య కార్మికులంటే తనకు గౌరవమని, వారి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో పనిచేస్తున్న సమ యంలోనే సీతక్క చేసే సేవా కార్యక్రమాలను తెలుసు కున్నానన్నారు. కరోనా, వరదల సమయంలో బాధితు లకు ఆపన్న హస్తం అందించడం గొప్ప విషయమని కొనియాడారు. తన స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లో కూడా సీతక్క గురించి అక్కడి ప్రజలకు తెలుసున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, జడ్పీ సీఈవో ప్రసూనారాణి, డీపీవో వెంకయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి నిట్‌లో టెక్నోజియాన్

'ఇంజీనీయస్' థీమ్ మూడురోజుల పాటు నిర్వహణ

ప్రారంభ వేడుకకు ప్రముఖ సైంటిస్ట్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందర రాజన్ రాక

నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్

నిట్‌క్యాంపస్ (కాజీపేట), జనవరి 18: వరంగల్ నిట్‌లో యేటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే టెక్నో ఫెస్ట్ టెక్నోజియాన్- 2024 జనవరి 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి తెలిపారు. గురువారం నిట్ సెనెట్‌హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి మాట్లాడారు. నిట్ టెక్నోజియాన్ యువతకు, సాంకేతిక అభివృద్ధి అందించడంలో ఎంతగానో తోడ్పడిందన్నారు. ఈ ఫెస్ట్‌కు వివిధ ప్రాంతాల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు వినూత్న ఆలోచనలు సేకరించడానికి, వారి సామర్థ్యాలను, ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ టెక్నోజియాన్‌లో అనేక టాప్‌క్లాస్ ఈవెంట్‌లు ఉంటాయన్నారు. ప్రతీ ఏటా వివిధ థీమ్‌లతో నిర్వహించే టెక్నోజియాన్‌ను ఈ ఏడాది 'ఇంజీనీయస్' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామన్నారు. ఇంజనీయస్ అంటే ఇన్నోవేషన్‌ను సూచిస్తుందని, ఇది అన్వేషణ, సృజనాత్మకత, సాంకేతిక పరివర్తన దాని స్ఫూర్తిని కల్పించే భావన అన్నారు.

కాగా, నిట్ అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించనున్న టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిట్ చెన్నై త్రిచి డైరెక్టర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందర రాజన్ హాజరుకానున్నారని నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి చెప్పారు. ఏరోస్పేస్, మిస్సైల్‌కు సైంటిస్టుగా పని చేసిన ఆయన.. నిట్ టెక్నోజియాన్‌కు ముఖ్య అతిథిగా రావడం అభినందనీయం అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం, ఇస్రో సైంటిస్ట్ టీఎస్ సురేశ్‌కుమార్ పాల్గొననున్నారని చెప్పారు. జహాజ్, ఆర్‌సీ బగ్గీ, హోవర్ మానియా, దర్చువల్ రియాలిటీ, డీబగ్గింగ్ మానియా, మొదలైన స్పాట్ ఈవెంట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఇవే కాకుండా వర్క్‌షాపులు, సాంకేతిక కార్యక్రమాలు, క్విజ్ తోపాటు సుమారు 40 ఈవెంట్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ టెక్నోజియాన్‌లో పాఠశాలల విద్యార్థులు తమ నమూనాల, ఆలోచనలు కూడా ప్రదర్శిస్తారని తెలిపారు.

ఈ మీడియా సమావేశంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాస్, టెక్నోజియాన్ ఫ్యాకల్టీ అడ్వయిజర్ పి.హరిప్రసాద్, ప్రొఫెసర్లు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, టెక్నోజియాన్ కోర్ టీం సభ్యులు చంద్రనాయక్, సాహత్, విష్ణు, స్ఫూర్తి విశాల్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బలరాం



సిరికొండ బలరాం

ములుగు, జనవరి 18: భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడిగా సిరికొండ బలరాం నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు పట్టణానికి చెందిన బలరాం విద్యార్థి దశలోనే ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా పనిచేశారు. కర సేవకుడిగా బాబ్రీ కూల్చివేత ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఆయన 15 రోజులు జైలు శిక్ష అనుభవించారు. బీజేపీ ములుగు పట్టణ అధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న బలరాంను రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. తన నియామకం పట్ల బలరాం రాష్ట్ర అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని సంస్థాగతంగా పటిష్టపరిచేందుకు కృషి చేస్తానని అన్నారు.

వెంకటాపూర్‌లో ఓపెన్‌కాస్ట్‌కు సర్వే

వెంకటాపూర్(రామప్ప), జనవరి 18: సింగరేణి కాలరీస్ ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ప్రాజెక్టు కోసం ఆ సంస్థ అధికారులు మండల కేంద్రంలో మళ్లీ సర్వే చేపడుతున్నారు. ఓపెన్‌కాస్టు సర్వేను సింగరేణి అధికారులు 2020 నవంబరు 18న చేపట్టారు. రూ.42.80 మిలియన్ల వ్యయంతో ప్రాజెక్టును నిర్మించాలనే ప్రతిపాదన మేరకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లారు. అయితే.. ప్రఖ్యాత రామప్ప దేవాలయం యునెస్కో గుర్తింపు పొందిన నేపథ్యంలో దీనికి బ్రేక్ పడింది. పలు అభ్యంతరాల వల్ల సర్వే అక్కడికే ఆగిపోయింది.

ఇదే క్రమంలో సింగరేణి అధికారులు సర్వే పనులను గోప్యంగా చేసినట్లు తెలిసింది. 315హెక్టార్ల అటవీ భూమి, 1.466 ఎకరాల వ్యవసాయ భూమి, అసైన్డ్‌భూములను సేకరించేందుకు సర్వే చేపట్టినట్లు తెలుస్తోంది. సుమారు 20ఏళ్ల కాలవ్యవధిలో 40.43మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ఈ ఓపెన్‌కాస్టును ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం.

నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపు

● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ● వరంగల్ ప్రాంతంలోని సీసీ రోడ్ల పరిశీలన

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), జనవరి 18: నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే పనుల బిల్లుల చెల్లింపులు చేస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బల్దియా పరిధిలో వరంగల్ ప్రాంతంలోని ఫోర్త్‌రోడ్‌లోని విద్యానగర్ కాలనీ, బృందావన్ పబ్లిక్ స్కూల్, రంగశాయిపేటలోని శ్రీసాయినగర్, నాగేంద్ర నగర్ ఫేజ్-2 ప్రాంతం, కరీమాబాద్ బండి వారి వీధి, ఉర్సు వాటర్‌ట్యాంక్ ప్రాంతాల్లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన సీసీ రోడ్లకు చెందిన బిల్లుల చెల్లింపు కోసం కమిషనర్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టెండర్ నిబంధనలకు లోబడి అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. నాణ్యత ప్రమాణాల్లో నిబద్ధత లేకుంటే బిల్లుల్లో కోత విధించడం జరుగుతుందన్నారు. రంగశాయిపేట ప్రాంతంలో రోడ్డుపై గృహ నిర్మాణ వ్యర్థాలను ఉంచిన యజమానికి పెనాల్టీ విధించాలన్నారు. అలాగే నాగేంద్ర నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనానికి అనుమతి ఉందో లేదా పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈ శ్రీనివాస్, డీఈ రవికిరణ్, శానిటరీ సూపర్ వైజర్ సాంబయ్య, ఏఈలు మోజామిల్, హబీబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి

టీయూఎఫ్ఐడీసీ పథకం కింద అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ ముంపు నివారణ చర్యల్లో భాగంగా గతంలో సూచించిన అభివృద్ధి పనులే కాకుండా ఇందులో చేర్చాల్సిన పనులైన ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌పైన తగు సూచనలు చేశారు. భద్రకాళి నాలా, బండ్ నుంచి వెళ్లే నాలా, చిన్న వడ్డెపల్లి చెరువు నుంచి, పెద్ద వడ్డెపల్లి నుంచి వెళ్లే నాలాలతోపాటు రిటైనింగ్ వాల్స్, బల్దియా పరిధిలోని 66వ డివిజన్లలో అవసరమైన ప్రాంతాల్లో కల్వర్టులు, అంతర్గత రహదారుల నిర్మాణాలపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి, ఆరుగురికి గాయాలు ● బావుపేట వద్ద టాటా ఏస్‌ను ఢీకొన్న కారు

హసన్‌పర్తి/కరీమాబాద్, జనవరి 18: దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా గురువారం రాత్రి టాటా ఏస్ వాహనాన్ని కారు ఢీ కొన్న సంఘటనలో వరంగల్‌లోని ఉర్సు - కరీమాబాద్‌కు చెందిన ఆమంచ శ్యాంసుందర్ (45), ఖిలావరంగల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన డ్రైవర్ రవి (40) ఇద్దరు మృతి చెందారు. ఆరుగురు గాయపడ్డారు. హసన్‌పర్తి సబ్ ఇన్స్‌పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం..

ఉర్సు ప్రాంతానికి చెందిన ఉర్సు బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు, మునిసిపల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న ఆమంచ శ్యామ్(53).. ఈనెల 16న కుటుంబసభ్యులతో కలిసి శ్రీ రాజ రాజేశ్వరస్వామి దర్శనానికి వేములవాడకు బయలుదేరాడు. శ్యామ్ తల్లి లలిత, భార్య దేవి, కుమారుడు లక్ష్మణ్, సోదరుడు ఆమంచ సంతోష్, అతడి కూతురు అలేఖ్య, కుమారుడు నాగేంద్రతో కలిసి తిమ్మాపూర్ ప్రాంతానికి చెందిన కదరిక రవి(40) టాటా ఏఎస్ వాహనంలో వెళ్లారు. దర్శనం చేసుకుని గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం బావుపేట గ్రామం వద్దకు రాగానే ఆటో ట్రాలీని వెనుకనుంచి వచ్చిన ఓ కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమంచ శ్యామ్ అక్కడిక్కడే మృతి చెందగా, కుటుంబ సభ్యులతోపాటు, ఆటో డ్రైవర్ రవికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ రవి (40) మృతి చెందాడు. ఆటో డ్రైవర్ రవికి భార్య శ్రీవిద్య, కుమారులు కిరణ్ తేజ, రవితేజ, కూమార్తె శ్రీ కీర్తన ఉన్నారు. మరో మృతుడు ఆమంచ శ్యామ్ కుటుంబ సభ్యులు స్వల్పగాయాలతో బయటపడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదానికి కారణమైన కారు



మృతి చెందిన ఆమంచ శ్యామ్

బస్సు ఎక్కితే ప్రాణాలు దక్కేవి..

ఆమంచ శ్యామ్ వేములవాడ నుంచి కరీంనగర్ చేరుకున్నాక తాను బస్సులో వస్తానని చెప్పి కరీంనగర్ బస్టాండ్‌కు వెళ్లాడు. కానీ, అక్కడ ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో తిరిగి ఆటోలోనే ఎక్కాడు. బస్సులో ఎక్కినా బతికేవాడని మృతుడి తల్లి ఆమంచ లలిత, అతడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా, మృతుడు శ్యామ్ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని స్థానికులు చెబుతున్నారు.

సంఘటితంతోనే సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టి

ఐనవోలు మార్ట్‌ను సందర్శించిన నాబార్డు సీజీఎం సుశీల చింతల

ఐనవోలు, జనవరి 18: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(ప్యాక్స్) ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విశేషంగా కృషి చేస్తున్నాయని నాబార్డు సీజీఎం సుశీల చింతల తెలిపారు. నందనం ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఐనవోలులో ఏర్పాటు చేసిన సూపర్‌మార్కెట్(మార్ట్) విక్రయకేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. మార్ట్‌లో వస్తువుల క్రయ, విక్రయాలు జరుగుతున్న తీరు, వినియోగదారులకు లభించే ధరలను పరిశీలించారు.



ఐనవోలులో మార్ట్‌ను పరిశీలిస్తున్న నాబార్డు సీజీఎం సుశీల చింతల, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐనవోలులో ఏర్పాటు చేసిన మార్ట్ వినియోగదారులకు ఆకట్టుకునేవిధంగా ఉందన్నారు. పట్టణాల్లో కార్పొరేట్ స్థాయిల్లో ఏర్పాటు చేసే మార్ట్‌లకు తీసిపోనివిధంగా ఐనవోలు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్యాక్స్ మార్ట్‌లో వస్తువులు, నిత్యావసర సరుకులు మార్కెట్ ధరలకంటే వినియోగదారులకు తక్కువకే విక్రయిస్తూ తాము సైతం ఆర్థికంగా ఎదిగేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కేవలం 10 మాసాల కాలంలో రూ.1.89 కోట్ల వ్యాపారం నిర్వహించి రూ.13 లక్షల లాభాలను ఆర్జించినట్లు గుర్తించామన్నారు. ఈ వ్యాపార కేంద్రంలో కీలక భూమిక పోషిస్తున్న నందనం ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సభ్యుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మొబైల్ విక్రయసేవలతోపాటు మార్ట్‌ల్లో కూరగాయల విక్రయం, విభిన్నరంగాల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు మహిళలు, రైతులకు శిక్షణ ఇచ్చి తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, నాబార్డు డీజీఎం శ్రీనివాసులు, డీడీఎం రవి, చంద్రశేఖర్, డీసీసీబీ బ్యాంక్ సీఈవో మహ్మద్ వజీర్‌సుల్తాన్, ఏజీఎం ఎల్. రాజశేఖర్, డీసీవో నాగేశ్వర్‌రావు, ఇంజనీర్ మోహన్, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, డైరెక్టర్లు చిరంజీవి, శ్రీనివాస్, రాజారపు కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుల్లో మార్పులు

వరంగల్, ములుగు జిల్లాలకు రవికుమార్, బలరామ్

హనుమకొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ సంస్థాగత మార్పులను చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షులను మార్చింది. పలు జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ బాగాపని చేసిన జిల్లాల అధ్యక్షులను మాత్రం మార్చలేదు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. కొత్తగా నియమితులైన జిల్లా అధ్యక్షులకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫోన్ చేసి సమాచారం అందించారు.

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలుగా రావు పద్మను యథావిధిగా కొనసాగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పద్మ 20వేలకుపైగా ఓట్లు తెచ్చుకొని మూడోస్థానంలో నిలిచారు. అలాగే జనగామ జిల్లా అధ్యక్షుడిని కూడా మార్చలేదు. ప్రస్తుతం జనగామ జిల్లాకు డాక్టర్ ఎ.దశమంతరెడ్డిని కొనసాగించింది. అయితే మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధ్యక్షుల పేర్లను జాబితాలో పేర్కొనలేదు. పాతవారినే కొనసాగిస్తారా లేక ఈ జిల్లాల అధ్యక్షుల మార్పును పెండింగ్‌లో పెట్టిందా అన్న విషయమై స్పష్టత లేదు. మిగతా జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించారు.

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గంట రవికుమార్‌ను, ములుగు జిల్లా అధ్యక్షుడిగా బలరామ్‌ను పార్టీ నియమించింది. మొత్తం 12 జిల్లాలకు కొత్త అధ్యక్షులను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఆరు మోర్చాలకు కూడా కొత్త అధ్యక్షులను నియమించింది. ఇందులో భాగంగా ఎస్సీ మోర్చ అధ్యక్షుడిగా కొండేటి శ్రీధర్ నియమితులయ్యారు. శ్రీధర్ ఇంతకు ముందు వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

నగరంలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయీంనగర్, జనవరి 18: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్-2, టీవీ టవర్ కాలనీ, వాటర్ ట్యాంక్, వెంకటేశ్వర్ ఆలయం, నాగరాజు ఆలయం ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. అదేవిధంగా ఎక్సైజ్ కాలనీ, కనకదుర్గాకాలనీ ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, దర్గా, బాలసంతావాడ, హరిజనవాడ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఫాతిమానగర్ ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, భవానీనగర్, హౌసింగ్‌బోర్డు, ఇందిరానగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, వడ్డెపల్లి, విజయ్‌పాల్‌కాలనీ, టీచర్స్‌కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అలాగే ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా గొర్రెకుంట సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా కరీమాబాద్ రోడ్, శాంతినగర్, రామాలయం, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, ఫోర్ట్ రోడ్, వాల్‌మార్ట్, అన్నపూర్ణ కాంప్లెక్స్, పద్మశాలి వీధి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, మామునూర్, నక్కలపల్లి, బెస్తం చెరువు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, అరెపల్లి, అయ్యప్ప ఆలయం, అగ్రికల్చర్ కాలేజీ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, పోచమ్మమైదాన్ సర్కిల్, మండిబజార్, బొందలకుంట ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్, ఆపరేషన్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ శంకేషి మల్లికార్జున్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేయూలో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

కేయూ క్యాంపస్, జనవరి 18: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం, సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ టీచింగ్ (సీఇఎల్‌టీ) ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై 40 రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేసినట్లు సీఇఎల్‌టీ డైరెక్టర్ డాక్టర్ ఆర్. మేఘనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 22 నుంచి ప్రతీ రోజు సాయంత్రం తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆంగ్లభాష సామర్థ్యాల పెంపు, దినచర్యలో ఇంగ్లీష్ కమ్యూనికేషన్ పాత్ర, ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్, డిబెట్, వివిధ మాధ్యమాలను ఉపయోగించి సమాచార సేకరణ పంపటం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. వర్సిటీ విద్యార్థులకు రూ.వెయ్యి, ఇతర విద్యార్థులకు రూ. 1500 చెల్లించాలని కోరారు. ఇతర వివరాలకు కేయూ ఇంగ్లీష్ విభాగంలో సంప్రదించాలని పేర్కొన్నారు.





చలో అయోధ్య!

అయోధ్య రామ్‌లల్లాకు వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్‌ల నుంచి ప్రత్యేక రైళ్లు

గిర్మాజీపేట, జనవరి 18 : అయోధ్యలో రామ మందిర నిర్మాణ పూర్తయిన సందర్భంగా అయోధ్య రామ్‌లల్లా మందిరానికి రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. అయోధ్యకు దేశ నలుమూల నుంచి రైలు సదుపాయం కల్పించాలని రైల్వేశాఖ భావిస్తోంది. ఇప్పటి వరకు వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజలకు నేరుగా అయోధ్య వెళ్లేందుకు రైలు సదుపాయం లేదు. అయితే రామ మందిరం ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులోకి తెచ్చారు. అలాగే, వంద రోజులపాటు ప్రత్యేక రైళ్లను కాజీపేట నుంచి నడువనున్నాయి. అయోధ్యలో రద్దీ నేపథ్యంలో వీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. వంద రోజుల తర్వాత వీటిని ఇలాగే కొనసాగిస్తారా.. లేక రద్దు చేస్తారా.. అన్నది తెలియాల్సి ఉంది.

వరంగల్ నుంచి శ్రద్ధాసేత్ ఎక్స్‌ప్రెస్

వరంగల్ నుంచి నేరుగా అయోధ్యకు ఇటీవల రామేశ్వరం- అయోధ్య ధామ్ శ్రద్ధాసేత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తెచ్చారు. శ్రద్ధాసేత్ ప్రతీ ఆదివారం రాత్రి 11.50 గంటలకు రామేశ్వరం నుంచి బయలుదేరి సోమవారం రాత్రి 11.08 గంటలకు వరంగల్ చేరుకుంటుంది. వరంగల్‌లో రాత్రి 11.10 గంటలకు బయలుదేరి బల్లార్ష, నాగపూర్, ఈటార్సీ, జబల్‌పూర్, సత్నా, ప్రయాగరాజ్ మీదుగా బుధవారం ఉదయం 4.40 గంటలకు అయోధ్య ధామ్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. అలాగే, అయోధ్య నుంచి రామేశ్వరం ప్రయాణించే శ్రద్ధాసేత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం రాత్రి 11.10 గంటలకు అయోధ్యలో బయలు దేరి శుక్రవారం తెల్లవారు జామున 2.03 గంటలకు వరంగల్ చేరుకుంటుంది. తిరిగి 2.05 గంటలకు వరంగల్ నుంచి బయలుదేరి విజయవాడ, గూడూరు మీదుగా రామేశ్వరానికి శనివారం తెల్లవారుజామున 3.10 గంటలకు చేరుకుంటుంది.

కాజీపేట నుంచి యశ్వంతపూర్- గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్..

ప్రతీ శుక్రవారం కాజీపేట నుంచి అయోధ్యకు యశ్వంతపూర్-గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఇటీవల అందుబాటులోకి వచ్చింది. గురువారం రాత్రి 11.40 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.08గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. 2 నిమిషాల అనంతరం కాజీపేట నుంచి బయలుదేరి శనివారం సాయంత్రం 4.24గంటలకు అయోధ్యధామ్ చేరుకుంటుంది.

టికెట్ ధరలు ఇలా..

రామేశ్వరం-అయోధ్య, ధామ్-రామేశ్వరం మధ్య నడిచే శ్రద్ధాసేత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ని వర్గాల ప్రజలు ప్రయాణించేలా రిజర్వేషన్‌తో పాటుగా జనరల్ బోగీలు ఉన్నాయి. సెకండ్ ఏసీ బోగీలు 2, థర్డ్ ఏసీ బోగీలు 3, స్లీపర్ బోగీలు 7, జనరల్ బోగీలు 2 ఉన్నాయి. జనరల్ బోగీలు ముందు ఒకటి. వెనుక ఒకటి ఉన్నాయి. వరంగల్ నుంచి అయోధ్యకు జనరల్ టికెట్ రూ.400, స్లీపర్ రూ.685, సెకండ్ ఏసీ రూ.2,570, థర్డ్ ఏసీ రూ.1,790 ఉంది. అయోధ్య నుంచి వరంగల్‌కు కూడా ఇవే ధరలు ఉన్నాయి. అలాగే కాజీపేట నుంచి అయోధ్యకు, అయోధ్య నుంచి కాజీపేటకు యశ్వంతపూర్- గోరక్‌పూర్- యశ్వంత్‌పూర్ రైల్‌లోనే ఇవే టికెట్ ధరలు ఉన్నాయని తెలిసింది. .

30 నుంచి కాజీపేట నుంచి ప్రత్యేక రైళ్లు

ఈనెల 22న అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన నేపథ్యంలో అయోధ్యలో పెరగనున్న రద్దీ దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ సికిందరాబాద్, కాజీపేట రైల్వేస్టేషన్‌ల నుంచి అయోధ్య ధామ్ స్టేషన్‌కు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇందులో భాగంగా కాజీపేట- అయోధ్య ప్రత్యేక రైళ్లు కాజీపేట నుంచి ఈనెల 30, ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26,2 8 తేదీల్లో సాయంత్రం 6.20 గంటలకు అయోధ్యకు బయలుదేరుతాయి. సికిందరాబాద్ నుంచి అయోధ్య మధ్య నడిచే ప్రత్యేక రైళ్లు ఈనెల 29, 31, ఫిబ్రవరి 2, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25 తేదీల్లో సాయంత్రం 4.45గంటలకు సికిందరాబాద్ నుంచి అయోధ్యకు బయలుదేరుతాయి. ఈ రైళ్లన్నీ కాజీపేట మీదుగానే అయోధ్యకు వెళుతూ కాజీపేటలో ఆగుతాయి. సికింద్రాబాద్, కాజీపేట స్టేషన్‌ల నుంచి అయోధ్యకు వెళ్లు ప్రత్యేక రైళ్ల టికెట్‌ను కేవలం రైల్వేకి చెందిన ఐఆర్‌టీసీ వెబ్‌సైట్ ద్వారానే బుక్ చేసుకోవాలని రైల్వేశాఖ తెలిపింది. అయితే టికెట్ ధరలను ప్రకటించలేదు.

మిర్చి, పసుపు నాణ్యత ఉండేలా చూడాలి

స్పైసెస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ వి.విజిష్ట

వరంగల్‌టౌన్, జనవరి 18: మిర్చి పసుపు పంట సరుకు నాణ్యత ఉండేలా చూసుకోవాలని, అప్పుడే ఎగుమతులకు, గిట్టుబాటు ధర పలికే అవకాశ ఉంటుందని వరంగల్ రీజియన్ స్పైసెస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ వి.విజిష్ట అన్నారు. గురువారం నగరంలోని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో స్పైసెస్ బోర్డు వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో రైతులకు, వ్యాపారులకు అవగాహన సదస్సు చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజిష్ట మాట్లాడుతూ.. సుగంధ ద్రవ్యాలు, పసుపు, మిర్చి నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలోనే మిరప పంట ఉత్పత్తిలో తెలంగాణ లోని ఖమ్మం, వరంగల్ జిల్లాలో ఎక్కువగా సాగు అవుతుందన్నారు. పసుపు సాగుకు కూడా అనువైన భూములు ఇక్కడ ఉన్నాయన్నారు. స్పైసెస్ బోర్డు ల్యాబ్ వరంగల్‌లో లేకపోవడం వల్ల ప్రతీసారి హైదరాబాద్‌కు, లేదా గుంటూరుకు వెళ్లాలంటే రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మార్కెట్ కమిటీ స్పైసెస్ ల్యాబ్ ఏర్పాటుకు కావాల్సిన భూమి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా... ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాబార్డు అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్, చాంబర్ ప్రతినిధులు మడైరి వేదప్రకాష్, కైలాస హరినాథ్, రాజేశ్వర్‌రావు, గౌరిశెట్టి శ్రీనివాస్, రాయిశెట్టి సత్యనారాయణ, దేవర రమేష్ పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విజిష్ట


కరపత్రాలు ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు సుధ

గురుకుల ప్రవేశ పరీక్షలపై ప్రచారం

హనుమకొండ రూరల్, జనవరి 18: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరానికిగాను 5వ తరగతి ప్రవేశ పరీక్షపై ఓ ఉపాధ్యాయురాలు విస్తృత ప్రచారం చేస్తోంది. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ధర్మసాగర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న మాడిశెట్టి సుధ గురుకుల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి విద్యారాణి ఆదేశాలతో హనుమకొండ పద్మాక్షి కాలనీలో గురువారం ప్రచారం నిర్వహించారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి 11వ తేదీన పరీక్ష ఉంటుందని ప్రచారంలో భాగంగా వివరిస్తున్నారు. గురుకుల పాఠశాలల్లో కల్పించే వసతులు, విద్యా ప్రమాణాలు, క్రీడలు తదితర అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

కమిషనరేట్‌లో ఇద్దరు ఎస్‌ఐల బదిలీ

హనుమకొండ క్రైం, జనవరి 18: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే పీఎస్‌లో ఎక్కువ రోజు లు విధులు నిర్వర్తిస్తుండడంతో ఇద్దరికి స్థానచలనం కలిగించారు. హనుమకొండ పీఎస్‌లో పని చేస్తున్న బి.రామారావును చెన్నారావుపేటకు, చెన్నారావుపేటలో పనిచేస్తున్న పి.శ్రీనివాస్‌ను హనుమకొండకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా సూచించారు.

రైల్వే క్రికెట్ పోటీల్లో లోకోపైలెట్ టీం విజయం

కాజీపేట, జనవరి 18: కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రైల్వే స్టేడియంలో నిర్వహిస్తున్న రైల్వే క్రికెట్ పోటీలు గురువారం మూడో రోజు కొనసాగాయి. ఈ పోటీలను డీఈఈ అభిషేక్ మిశ్రా, ఛీఫ్ క్రూకంట్రోలర్ ఎ.సాంబశివుడు హాజరై పోటీలను ప్రారంభించారు. చీఫ్ క్రూ కంట్రోల్ ('సీసీసీ)లోకోపైలెట్ టీం, మహబూబాబాద్ టీంలు మధ్య జరిగిన పోటీల్లో (సీసీసీ) లోకోపైలెట్‌ల టీం విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆపరేటింగ్ ఫ్రెండ్స్ టీం, వరంగల్ కింగ్స్ 11 టీం మధ్య జరిగిన పోటీలో ఆపరేటింగ్ ఫ్రెండ్స్ టీం విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం. రాజయ్య, ట్రెజరర్ జి. రాజేశ్వర్‌రావుతోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

వాజేడు, జనవరి 18: లైంగిక దాడి కేసులో ఒకరికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ములుగు కోర్టు తీర్పు వెలువరించింది. వాజేడు ఎస్సై సి.హెచ్.వెంకటేశ్వరరావు ఈ మేరకు గురువారం వెల్లడించారు. వాజేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో ఓ మహిళపై చెరుకూరుకు చెందిన యాలం భూపతిరావు లైంగికదాడి చేశాడు. బాధితురాలు వాజేడు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ కె.శివప్రసాద్, ఎస్సై కె. తిరుపతిరావు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు.

ప్రస్తుత సీఐ బండారి కుమార్, ఎస్సై వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఆఫీసర్ కమలాకర్, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా అడిషనల్ పీపీ సి.హెచ్.సత్యనారయణ కేసును వాదించారు. వాదోపవాదాల అనంతరం ములుగు జిల్లా జడ్జి లలితశివజ్యోతి ముద్దాయికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 18వేల జరిమానా విధించారు.

నర్సంపేటలో దొంగల హల్‌చల్

తాళం వేసి ఉన్న రెండిళ్లల్లో చోరీ


చోరీకి గురైన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది

నర్సంపేట టౌన్, జనవరి 18: రెండిళ్లలో దొంగలు పడి బుధవారం రాత్రి నగలు, నగదు దోచికెళ్లారు. ఈ ఘటనలో రూ. 7లక్షల నగదు అపహరణకు గురైంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. హనుమకొండ ప్రాంతానికి చెందిన మొలుగూరి నాగేందర్ కుటుంబం ఆరు నెలలుగా నర్సంపేట పట్టణంలోని మహబూబాద్‌లోని ఓం సాయినగర్‌లోని ఓ ప్లాట్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. నాగేందర్ కొద్ది రోజులుగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో జాయింట్ వీల్ (ఎగ్జిబిషన్) వ్యాపారం నిర్వర్తిస్తూ అప్పుడప్పుడు ఇంటికి వచ్చిపోతున్నాడు. భర్తకు తోడుగా ఉండేందుకు నాగేందర్ భార్య శిరీష, కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 16న ఇంటికి తాళం వేసి జాతరకు వెళ్లింది. కాగా, నాగేందర్, శిరీషలు గురువారం తెల్లవారు జామున 3 గంటలకు ఇంటికి రాగా, ఇంటి మెయిన్ డోర్‌కు వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడం, అందులోని రూ.7 లక్షల నగదు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి లబోదిబోమన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా టౌన్ సీఐ సుంకరి రవీందర్, ఎస్సై శీలం రవి, క్లూస్ టీమ్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు నాగేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఇదిలావుండగా, నాగేందర్ ఇంటి పక్కన ఉన్న ఇమ్మడి వెంకటేశ్వర్లు, పద్మల కుటుంబం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని కొడుకు వద్దకు వెళ్లారు. వీరి ఇంటి తాళాలు సైతం దొంగలు పగులగొట్టి ఇంట్లో వస్తువులన్నీ చిందరవందర చేశారు. విషయాన్ని పోలీసులు వెంకటేశ్వర్లు కుటుంబానికి సమాచారం అందించినప్పటికీ వారి నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ వివరించారు.

వెల్‌నెస్ సెంటర్‌కు ఏర్పాట్ల పరిశీలన

కాళోజీ జంక్షన్, జనవరి 18: కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్న ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్య చికిత్సలు అందించేందుకు హనుమకొండలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడానికి అవసరమైన వనరుల ఏర్పాటు కోసం సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ సర్వీస్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.లక్ష్మయ్య గురువారం హనుమకొండకు వచ్చారు. ఈ మేరకు ఆయన వసతి కోసం హనుమకొండ పోస్టాఫీస్ వెనుక గల క్వార్టర్లను, సీఆర్‌పీఎఫ్ క్యాంపులో గల క్వార్టర్లు పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు కనీసం 6వేల మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉండాల్సి ఉంటుందని వరంగల్, హనుమకొండ పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాల్లో వారి సంఖ్య సుమారు 10వేలకు పైగానే ఉన్నట్లు వివరాలను సేకరించారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు 25 ప్రాంతాల నుంచి వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిసింది. రాష్ట్రంలో ఒక్క హైదరాబాద్‌లో మాత్రమే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం వెల్‌నెస్ సెంటర్ పనిచేస్తోంది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యత గల ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు అన్ని విధాలుగా అర్హతలు ఉన్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ అభిప్రాయపడినట్లు తెలిసింది. హనుమకొండలో ఏర్పాటు చేసే ప్రతిపాదనను మరో వారం రోజుల్లో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమక్షంలో ఏర్పాటు చేయనున్నారు. సమావేశంలో హనుమకొండ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కొలిక్కి రానున్నట్లు తెలుస్తోంది.

గృహహింస కేసులో మూడేళ్లు జైలు శిక్ష

నర్సింహులపేట, జనవరి 18 : గృహహింస కేసులో ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష పడినట్లు ఎస్సై జి.సతీష్ గురువారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని పడమటిగూడెం గ్రామానికి చెందిన కొండ రమేష్‌తో పెద్దనాగారం గ్రామానికి చెందిన తేజస్వినికి 2007లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మగ సంతానం రమేష్ వేరొక మహిళను 2013లో వివాహం చేసుకున్నాడు. అప్పటినుంచి తేజస్వినిని తరుచుగా వేధిస్తూ, మానసికంగా హింసిస్తూ, వరకట్నం తేవాలని ఇబ్బందులకు గురి చేస్తుండటంతో తట్టుకోలేక 2014లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో తేజస్విని ఫిర్యాదు చేసింది. కేసు విచారణ చేపట్టిన తొర్రూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సరిత పోలీసులు ప్రవేశపెట్టిన ఆధారాలు, సాక్షులను విచారించిన అనంతరం ముద్దాయి రమేష్‌కు మూడేళ్ల కారాగార శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న ముందస్తు మొక్కులు

మేడారానికి భారీగా తరలివచ్చిన భక్తులు



మేడారం, జనవరి 18: వనదేవతలకు భక్తులు గురువారం ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి కుటుంబ సమేతంగా తల్లులను దర్శించుకున్నారు. సుమారు 50 వేల మంది హాజరయ్యారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి మహాజాతర జరగనుండగా ముందస్తుగా మొ క్కులు చెల్లించుకొనేందుకు వచ్చారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాల సమర్పించారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల వద్ద పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరె సారె, కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించారు.


మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు


వ్యాపారులకు నోటీసులు అందిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ప్లాస్టిక్ వినియోగంపై వ్యాపారులకు నోటీసులు

మేడారం, జనవరి 18 : మేడారంలో ప్లాస్టిక్ వినియోగంపై గ్రామ పంచాయతీ అధికారులు కొరడా ఝళిపించారు. పలువురు వ్యాపారులకు గురువారం నోటీసులు జారీ చేశారు. ప్లాస్టిక్ ఫ్రీ మహాజాతరగా జరుపుకునేందుకు అందరూ సహకరించాలని కోరారు. దీన్ని పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గద్దెల పరిసరాల్లో ఉన్న దుకాణాదారులను వెంటనే తొలగించుకోవాలని ఆదేశించారు.

గ్రామ కార్యదర్శులకు విధుల కేటాయింపు

తాడ్వాయి మండలం మేడారంలో మహా జాతరలో విధులు నిర్వహిచేందుకు గ్రామ పంచాయతీల కార్యదర్శులకు విధులు కేటాయించారు. డీపీవో వెంకయ్య ఆదేశాల మేరకు డీఎల్‌పీవో స్వరూప గురువారం ఈ కేటాయింపులు చేశారు. ములుగు జిల్లాలోని 150 మంది కార్యదర్శులకు ఎంపీవోలు శ్రీధర్‌రావు, శ్రీకాంత్‌నాయుడు, కుమార్, హనుమంతరావు, రహీం, శ్రీనివాస్, సాజిదా , మమత విధులు కేటాయించారు. మేడారం పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు సూపర్‌వైజర్లను నియమించారు. మహాజాతర ముగిసే వరకు వీరందరూ విధులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ట్రాఫిక్‌జామ్‌కు తావివ్వం

వాహనాల మళ్లింపునకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ డాక్టర్ శబరీశ్

ములుగు కలెక్టరేట్, జనవరి 18: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర నేపథ్యంలో వరంగల్-మేడారం వెళ్లేమార్గంలో ట్రాఫిక్‌జామ్ కాకుండా వాహనాల మళ్లింపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ములుగు ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. గురువారం ఆయన పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి ములుగు సమీపంలోని గట్టమ్మతల్లి దేవాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మేడారం మహాజాతరకు వెళ్లే భక్తులు ముందుగా గట్టమ్మతల్లిని దర్శించుకుని వెళతారని, ఈక్రమంలో వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్రవాహనాలను క్రమపద్ధతిలో మళ్లించేందుకు అన్నిరకాల భద్రతా చర్యలు చేపడుతున్నామని అన్నారు. వాహనాల రద్దీని తగ్గించేందుకు అనుభవజ్ఞులైన పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారని, అనుకోని విధంగా వాహనాలు మరమ్మతులకు గురైతే వాటిని వెనువెంటనే క్రేన్ల ద్వారా క్లియర్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూస్తామని అన్నారు. రాత్రివేళల్లో డైవర్షన్ పాయింట్లలో రేడియం స్టిక్కర్లతో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని, గట్టమ్మతల్లి దేవాలయం చుట్టుపక్కల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా ఉండే దుకాణాలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్, ఎస్సై వెంకటేశ్వర్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.


గట్టమ్మతల్లి దేవాలయం ఆవరణలో అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ శబరీశ్

కాళేశ్వరంపై కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్, జనవరి 18: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ అధికారులు చేపట్టిన విచారణ రెండోరోజు గురువారంకూడా కొనసాగింది. ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కన్నెపల్లి పంప్‌హౌస్‌ను డీజీ రాజీవ్ రతన్ నేతృత్వంలోని బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. సమారు ఎనిమిది గంటలపాటు ఇరు బ్యారేజీలు, పంప్‌హౌస్‌లో పర్యటించిన అధికారులు జరిగిన నష్టం, దానికి కారణాలపై ఆరా తీశారు. పలు అంశాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

- ఎనిమిది గంటలపాటు పరిశీలన

మహదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌కు గురువారం ఉదయం 9.30 గంటలకు విజిలెన్స్ డీజీ రాజీవ్ రతన్‌తోపాటు ఎస్పీ బాలకోటి, పది మంది అధికారులు చేరుకున్నారు. సుమారు రెండున్నర గంటలపాటు పంప్‌హౌస్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అండర్‌గ్రౌండ్‌లో ఉన్న మోటార్లు, వాటికి అనుసంధానంగా కంప్యూటర్లను పరిశీలించారు. వాటితోపాటు దెబ్బతిన్న ప్రాంతంలో జరిగిన నష్టం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫోర్‌బే, అప్రోచ్ కెనాల్, డెలివరీ చానళ్లను పరిశీలించిన అధికారులు వరదలకు ముందు, తర్వాత పంప్‌హౌస్ పరిస్థితిపై ఆరాతీశారు. నష్టం జరగడానికి కారణాలను ఇంజనీర్లను అడిగితెలుసుకున్నారు. అనంతరం గ్రావిటీ కెనాల్ మార్గంలో అన్నారం బ్యారేజీకి చేరుకున్న బృందం సుమారు రెండున్నర గంటల పాటు పరిశీలన చేశారు. బ్యారేజీలో బుంగలుపడి నీటి లీకేజీ కాగా ఆప్రాంతంలో అధికారులు చేపట్టిన మరమ్మతులను పరిశీలించారు. దీంతో పాటు గేట్ల వద్ద నీటి లీకేజీ కావడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్, అన్నారం బ్యారేజీల పరిశీలన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి కాళేశ్వరంలోని హరిత హోటల్‌కు చేరుకుని మధ్యాహ్న భోజనం చేశారు.

హరిత హోటల్ నుంచి మేడిగడ్డ బ్యారేజీకి బయల్దేరిన బృందం అక్కడ సుమారు మూడు గంటలపాటు పర్యటించారు. ముందుగా బ్యారేజీ వంతెన పైనుంచి బ్లాక్-7లో కుంగిపోయిన 20వ పిల్లరును పరిశీలించారు. అనంతరం మహారాష్ట్ర వైపు నుంచి నేరుగా వంతెన దిగువకు వెళ్లారు. బ్లాక్-7లో దెబ్బతిన్న 20పిల్లరుతోపాటు దెబ్బతిన్న మిగతాపిల్లర్ల కుంగుబాటుకు గల కారణాలు, జరిగిన నష్టం గురించి ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్యారేజీ గేట్లను దిగువ నుంచే పరిశీలించిన అధికారులు తిరిగి పైకి చేరుకుని ఆ ప్రాంతాన్ని మళ్లీ పునఃపరిశీలించారు. గేట్ల లిఫ్టింగ్ ప్రక్రియతో పాటు అవి ఎంతమేర ప్రవాహాన్ని తట్టుకోగలవు.. వాటి సామర్థ్యాలు ఏమిటి? అనే విషయాలపై ఆరా తీశారు. బ్యారేజీలో కుంగిపోయిన పిల్లర్లతో పాటు వంతెన దృశ్యాలను విజిలెన్స్ అధికారులు తమ ఫోన్లలో చిత్రీకరించారు. అక్కడి నుంచి నేరుగా మేడిగడ్డ బ్యారేజీ కంట్రోల్‌రూం కార్యాలయానికి చేరుకుని అధికారులతో సమీక్షించారు. అనంతరం కాళేశ్వరంలోని హరితహోటల్‌కు తిరిగి వెళ్లిపోయారు.

విజిలెన్స్ అధికారుల పర్యటనకు కొన్ని గంటల ముందు కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు మేడిగడ్డ బ్యారేజీ వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించారు. విజిలెన్స్ అధికారులు ఎక్కడెక్కడ పరిశీలించనున్నారో ఆ ప్రాంతాల్లో ఆయన తిరిగారు. ఆయన వెళ్లిపోయిన వెంటనే విజిలెన్స్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఇది యాధృచ్ఛికమా.. ముందుస్తుగా జాగ్రత్త పాటించేందుకే ఈఎన్సీ పర్యటించారా? అనేది చర్చనీయాంశమైంది.


కన్నెపల్లి పంప్‌హౌజ్ ఫోర్‌బే వద్ద విజిలెన్స్ అధికారులు

మినీ జాతరల్లో భక్తులకు
ఇబ్బందులు కలగొద్దు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క


గుర్రంపేటలో వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న మంత్రి సీతక్క

కాకతీయఖని, జనవరి 18: మినీ జాతరలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. భూపాలపల్లి మండల పరిధిలోని గుర్రంపేటలో జరిగే మినీ మేడారం జాతర పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సమ్మక్క, సారలమ్మ గద్దెలను దర్శించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.15లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

శ్రీనగర్-కొడిశలకుంట రహదారికి శంకుస్థాపన

ములుగు : మండలంలోని శ్రీనగర్ నుంచి కొడిశల కుంట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. 12కిలోమీటర్ల ఈ దారిని రెండు విభాగాలుగా రోడ్డు విస్తరణ, బీటీ రోడ్డు నిర్మించేందుకోసం ప్రభుత్వం రూ.5కోట్లను కేటాయించింది. ఈ రోడ్డు నిర్మాణంతో 15గ్రామాలకు రవాణా సదుపాయం మెరుగుపడుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, శ్రీనగర్ సర్పంచ్ గుగులోతు అనూష, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాలవికాస పథకాలు ఆలోచనలు రేకెత్తిస్తాయి..

కాజీపేట, జనవరి 18: బాలవికాస పథకాలు ప్రభుత్వాలకే ఆలోచనలు రేకెత్తించే విధంగా ఉంటూ పూర్తిస్థాయి ప్రజాసేవలో ఉంటాయని, ప్రజల కోసం పనిచేసే బాలవికాసకు ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం ఉంటుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రంలో ఏ నూతన కార్యక్రమం మొదలు పెట్టినా అది బాలవికాస నుంచే మొదలవుతుందని అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస ట్రెయినింగ్ సెంటర్‌లో గురువారం తాగునీటి శుద్ధీకరణ పథక కమిటీల మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. కొన్నేళ్లుగా బాలవికాస పలు రాష్ట్రాల్లో స్వచ్ఛందంగా ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మహిళా పథకాలు, చెరువు పూడికతీత, అనాథలకు ఆశ్రమం, తాగు నీటిశుద్ధీకరణ, మరుగుదొడ్ల నిర్మాణం, వితంతు విముక్తి, మూఢనమ్మకాలను నిర్మూలించడం లాంటి కార్యక్రమాలు రూపొందిస్తూ పలు సంస్థలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇలాంటి ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేపడుతున్న సంస్థ వ్యవస్థాపకురాలు బాల థెరిస్సా అభినందనీయులన్నారు.

అనంతరం మంత్రి సీతక్కను బాలవికాస కమిటీ శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. అంతకు ముందు బాలవికాస సంస్థ వ్యవస్థాపకురాలు బాల థెరిస్సా మాట్లాడారు. బాలవికాస 47 యేళ్లుగా పలు సేవాకార్యక్రమాలు చేపడుతోందన్నారు. పలు రాష్ట్రాలో నీటి శుద్ధీకరణ పథకాలతో లక్షల మందికి మంచి నీరు అందిస్తున్నామని అన్నారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ.. వాటర్ ప్లాంట్‌ల నిర్వహణలో గ్రామపంచాయతీ కమిటీలదే ముఖ్య పాత్ర అన్నారు. ప్లాంట్ల నిర్వహణలో కమిటీలు సేవాభావంతో పనిచేస్తే ఏ సమస్యలు రావన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ చీఫ్ ఇంజనీర్ డాక్టర్ శ్రీధర్, రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ వరంగల్ మేనేజర్ మహేందర్‌రెడ్డి, బాలవికాస ఫెడరేషన్ డైరెక్టర్ కేడం లింగమూర్తితో పాటు వాటర్ ప్లాంట్ల కమిటీల అధ్యక్షులు, ఆపరేటర్లు, సోపార్ కెనడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శోభ, బాలవికాస అధ్యక్షులు నోముల ఇంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు బాసాని మర్రెడ్డి, సంస్థ ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కోలిండియా హాకీ పోటీలు ప్రారంభం

కాకతీయఖని, జనవరి 18: కోలిండియా స్థాయి హాకీ పోటీలు గురువారం భూపాలపల్లిలో గురువారం ప్రారంభమయ్యాయి. బొగ్గు గనులు ఉన్న వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలకు సింగరేణి భూపాలపల్లి ఏరియా ఆతిథ్యమిచ్చింది. ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు అధ్యక్షతన పట్టణంలోని అంబేద్కర్ క్రీడామైదానంలో క్రీడలు జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్.వి.కె.శ్రీనివాస్‌తో కలిసి పోటీలను ప్రారంభించారు.

తొలిరోజు నాలుగు మ్యాచ్‌లు

కోలిండియా హాకీ పోటీల్లో భాగంగా తొలిరోజు నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. ఎనిమిది జట్లు తలపడగా నాలుగు జట్లు విజేతలుగా నిలిచాయి. తొలి మ్యాచ్ ఎస్‌సీసీఎల్ తెలంగాణ, ఎంసీఎల్ ఒడిశా జట్లు తలపడగా ఎస్‌సీసీఎల్ జట్టు మూడు గోల్ చేసింది. ప్రత్యర్థి జట్టు ఎంసీఎల్ ఒక గోల్ చేసి ఎస్‌సీసీఎల్ జట్టు చేతిలో రెండు గోల్స్ తేడాతో ఓటమిని చవిచూసింది. రెండో మ్యాచ్‌లో డబ్ల్యూసీఎల్ మహారాష్ట్ర, ఎన్‌సీఎల్ మధ్యప్రదేశ్ జట్లు తలపడ్డాయి. ఇందులో ఎన్‌సీఎల్ జట్టు రెండు గోల్స్ చేయగా

తొలిరోజు హోరాహోరీగా సాగిన క్రీడలు

డబ్ల్యూసీఎల్ జట్టు ఒక గోల్ చేసి ఎన్‌సీఎల్ జట్టు చేతిలో పరాజయం చెందింది. మూడో మ్యాచ్‌లో ఎస్ఈసీఎల్ ఛత్తీస్‌గఢ్, బీసీసీఎల్ జార్ఖండ్ జట్లు తలపడ్డాయి. ఎస్ఈసీఎల్ జట్టు 8 గోల్స్ చేయగా ప్రత్యర్థి జట్టు బీసీసీఎల్ గోల్స్ చేయకుండానే చేతులెత్తేసింది. నాలుగో మ్యాచ్‌లో సీసీఎల్ జార్ఖండ్, ఈసీఎల్ వెస్ట్ బెంగాల్ తలపడ్డాయి. ఇందులో సీసీఎల్ జట్టు 11 గోల్స్ చేయగా ఈసీఎల్ జట్టు రెండు గోల్స్ చేసింది. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు బసవయ్య, జక్కం రమేష్, బండి వెంకటయ్య, తుకారాం, గుండు రాజు, శ్యాంప్రసాద్, పర్స శ్రీనివాస్, కార్మిక సంఘం నాయ కులు కొరిమి రాజ్‌కుమార్ తదిత రులు పాల్గొన్నారు.


క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర నారాయణ


హాకీ పోటీల్లో తలపడుతున్న ఎస్‌సీసీఎల్ (తెలంగాణ), ఎంసీఎల్ (ఒడిశా) జట్లు

ఆపరేషన్ స్మైల్‌తో బాలల పరిరక్షణ : ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లిటౌన్, జనవరి 18: బాలల పరిరక్షణ కోసం ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం దోహదపడుతుందని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వెట్టిచాకిరీ నుంచి బాలలకు విముక్తి కలిగించి వారికి బంగారు భవిష్యత్ అందించాలనే లక్ష్యంతో ఆపరేషన్ స్మైల్-10 కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. బాల కార్మికులుగా ఇళ్లల్లో, ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న పిల్లలకు విముక్తి కల్పించేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించామని పేర్కొన్నారు. ఎవరైనా చిన్నపిల్లలను పనులకు తీసుకుంటే చట్టపరంగా శిక్షార్హులని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడం, ఆసక్తి ఉన్న పిల్లలకు చదువు చెప్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జనవరి 1 నుంచి 31 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 23 మంది బాధిత బాలలను రక్షించామని వెల్లడించారు. బాల కార్మికులకు విముక్తి కలిగించేందుకు 1098, 100 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కాటారం/మల్హర్, జనవరి 18: కాటారం మండల కేంద్రంతోపాటు రేగులగూడెం జీపీ పరిధిలో పలు అంగన్‌వాడీ కేంద్రాలను, మల్హర్ మండలంలోని తాడిచర్ల, చిన్నతూండ్ల, రుద్రారం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ గురువారం తనిఖీ చేశారు. మౌలిక సౌకర్యాల లేమిపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలతో మాట్లాడారు. మాతా శిశు సంరక్షణ సక్రమంగా జరిగేలా చూడాలని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర డిప్యూటీ సెక్రటరీ రఘువంశీ

వెంకటాపూర్(రామప్ప), జనవరి 18: వికసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అడవిరంగాపూర్ గ్రామంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అధ్యక్షతన ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. కేంద్ర డిప్యూటీ సెక్రటరీ రఘువంశీ, అసిస్టెంట్ సెక్రటరీ వి.పి.బాల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న ఆయుష్మాన్ భారత్, ముద్ర, ఉజ్వల, పీఎంఎస్‌వై వంటి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పవన్‌కుమార్, వైద్యులు శ్రీకాంత్, రాజ్‌కుమార్, సరిత, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 18: వీవోఏల సమస్యలను పరిష్కరించాలని ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలో వీవోఏల సమావేశం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. సెర్ప్ పరిధిలో పనిచేస్తున్న వీవోఏలకు అతితక్కువ వేతనం ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని, కనీస వేతనం రూ.26వేలు అందించాలని, ఇన్సూరెన్స్ రూ.10లక్షలు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం వీవోఏలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఏఐటీయూసీ డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు తోట మల్లికార్జునరావు, నాయకులు వేల్పుల మల్లికార్జునరావు, కట్ల రాజు, కృష్ణకుమారి, సాయి, మీనాకుమారి, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు నిరసన

భూపాలపల్లిటౌన్, జనవరి 18: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ టిక్కెట్టు ఇవ్వకపోవడం పట్ల కాంగ్రెస్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో భూపాలపల్లిలో గురువారం నిరసనకు దిగారు. పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఈ కార్యక్రమం జరిగింది. మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల ప్రభాకర్, నాయకులు జోగుల సమ్మయ్య అశోక్, తిరుపతి, రవి, రాజు, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పెసా గ్రామసభను రద్దు చేయాలి

వాజేడు, జనవరి 18: మండలంలోని భువనపల్లిలో గురువారం అధికారులు ఇసుక సొసైటీ కోసం నిర్వహించిన పెసా గ్రామసభను రద్దు చేయాలని భీమవరం గ్రామస్థులు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయకు గురువారం వినతిపత్రం అందించారు. భువనపల్లి-భీమవరం ఇసుక సొసైటీ గ్రామసభను అధికారులు ఏకపక్షంగా భువనపల్లిలో నిర్వహించారని తెలిపారు. భువనపల్లి, భీమవరం వేర్వేరు గ్రామాలు అయినప్పటికీ ఒకే గ్రామసభను నిర్వహించారని ఆరోపించారు. ధర్మవరం గ్రామపంచాయతీలో భువనపల్లి ఉందని, భీమవరం గ్రామం చింతూరులో ఉందని పేర్కొన్నారు. భీమవరానికి ఇసుక సొసైటీ కోసం ప్రభుత్వ అనుమతులు పొంది ఉందని, ఆ గ్రామంలో పెసా గ్రామసభను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం గిరిజనులు బందం మోహన్‌రావు, కుర్సం సుందర్‌రావు, యానక గున్నక్క, బందం లక్ష్మి, ధనమ్మ, కుర్సం శాంత, నీలక్క, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

గోవిందరావుపేట, జనవరి 18: హెచ్‌ఐవీ/ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ లింక్‌వర్కర్లు టి.కిషన్, బి.రాము అన్నారు. గురువారం మండలంలోని పస్రా గ్రామపంచాయతీ ఆవరణలో వైఆర్‌జీ కేర్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి ఉచితంగా ఎయిడ్స్ పరీక్ష చేస్తామని, ముఖ్యంగా గర్భిణులు తప్పకుండా హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఎమ్డీ.అంజుమ్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి : టీజేఎస్

కాకతీయఖని, జనవరి 18: రాష్ట్ర విభజన హామీల అమలు కోసం చేస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ జన సమితి భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రత్నం కిరణ్ కోరారు. బాతాల రాజు భవన్‌లో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 21న హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో నాయకులు గట్టయ్య, జనార్దన్, శ్రీధర్, శ్రీనివాస్, జయశంకర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 18: పదోతరగతి విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం ఆయన మండలంలోని నాయకులగూడెం, రంగరాజపురం, వెంకటాపురం, నూగూరు, ఒంటిమామిడి పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం అమలుతీరును పరిశీలించారు. ఈసందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ రోజువారీ స్లిప్‌టెస్టులు నిర్వహించాలని అన్నారు. అభ్యసదీపికలో ఇచ్చిన ప్రశ్నలకు విద్యార్థులచేత సమాధానాలు రాయించి వారి అనుమానాలను నివృత్తి చేయాలని అన్నారు. ఉన్నతి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నెలవారీ పరీక్షలు నిర్వహించి ఫలితాలను నమోదు చేయాలని సూచించారు. తొలిమెట్టు కార్యక్రమం అమలులో భాగంగా పాఠ్య ప్రణాళిక ప్రకారం బోధన చేయాలని, ఐదురోజుల బోధన తర్వాత ఆరవరోజు పరీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు.

మెడికల్‌బోర్డులో అవినీతిని నిర్మూలిస్తాం : ఏఐటీయూసీ

కాకతీయఖని, జనవరి 18: సింగరేణి మెడికల్ బోర్డులో జరుగుతున్న అవినీతిని సమూలంగా నిర్మూలిస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కారం చేయడంలో ఏఐటీయూసీ నిత్యం పోరాటాలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు.

ఎరియర్స్ ప్రకటనపై హర్షం

కాకతీయఖని, జనవరి 18: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు ఎరియర్స్ ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించడంపై హర్షం వ్యక్తమైంది. సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ భూపాలపల్లి అధ్యక్షుడు గుండేటి సమ్మయ్య గురువారం ఒక ప్రకటనలో సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని కోరారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి: ఎమ్మెల్యే గండ్ర

రేగొండ, జనవరి 18: మినీ మేడారం జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. మండలంలోని తిరుమలగిరి శివారులో నిర్వహించే మినీ మేడారం జాతర పనులను కలెక్టరు భవేష్ మిశ్రాతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బోర్‌వెల్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తిరుమలగిరిలోని మేడారం సమ్మక్క సారలక్క గద్దెలకు చేర్చే ప్రతి రోడ్డును డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కొత్తపల్లి కోటంచ ఆర్చ్ నుంచి ఆలయం వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలు పంపించానని అన్నారు. జాతరలో విద్యుత్, తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శామ్యూల్, ఎంపీడీవో సురేందర్, సర్పంచ్ కట్ల రాణి, ఎంపీటీసీ గంట గోపాల్, జాతర చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వీరబ్రహ్మం, నిమ్మల విజెందర్, గంగుల రమణారెడ్డి, పల్నాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆముదాలపల్లిలో కలెక్టర్ పర్యటన

కాకతీయఖని : భూపాలపల్లి మండలంలోని ఆముదాలపల్లి గ్రామ శివారులోని సమ్మక్క, సారలమ్మ మినీ మేడారం జాతర ఏర్పాట్లను కలెక్టర్ భవేష్ మిశ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రధాన రహదారి నుంచి గద్దెల వద్దకు వచ్చే మట్టిరోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. అలాగే మట్టిరోడ్డు మరమ్మతు పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. అనంతరం కమలాపూర్ నుంచి మేడారం వెళ్లే రహదారిపై గట్టమ్మతల్లి గుడిని పరిశీలించారు. మేడారం వెళ్లే భక్తులు గట్టమ్మతల్లి గుడిదగ్గర ఆగి మొక్కులు చెల్లించుకుని వెళ్తారు కాబట్టి వారికి ఇబ్బందులు కలగకుండా లైటింగ్, నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. భూపాలపల్లి నుంచి రాంపూర్ వెళ్లే రహదారిపై ప్రమాదకరంగా

ఎన్‌టీఆర్ వర్ధంతి

కాకతీయఖని, జనవరి 18: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని భూపాలపల్లిలో టీడీపీ నాయకులు గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మొక్కిరాల జనార్దన్‌రావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. నాయకులు నగేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- గణపురం: ఎన్టీఆర్ వర్ధంతిని మండల కేంద్రంలో టీడీపీ నాయకులు నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకుడు రాజ్‌పురోహిత్ గణేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేశారని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ ముత్యాల రాజయ్య, కాంగ్రెస్ నాయకులు నాగేశ్వర్‌రావు, పోశాల మహేష్, రామారావు, రాజు, సమీర్ పాల్గొన్నారు.

కాళేశ్వరంలో విజిలెన్స్ డీజీ పూజలు

మహదేవపూర్, జనవరి 18: మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర ఆలయాన్ని విజిలెన్స్ డీజీ రాజీవ్‌రతన్ గురువారం దర్శించుకున్నారు. ఉన్నతాధికారి కావడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడానికి ప్రత్నించగా ఆయన సున్నితంగా తిరస్కరించి సాధారణ భక్తుడిలా స్వామి వారిని దర్శించుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ఆరోపణలు రావడంతో ఆయన విచారణ నిమిత్తం కాళేశ్వరానికి వచ్చారు.


స్వామివారిని దర్శించుకున్న విజిలెన్స్ డీజీ

గుడిసెల తొలగింపునకు అధికారుల యత్నం

వాజేడు, జనవరి 18: మండల కేంద్రం సమీపంలో ఆరు నెలల క్రితం ప్రభుత్వ స్థలంలో వెలిసిన గుడిసెలను అధికారులు గురువారం తొలగించేందుకు యత్నించారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ పలువురు గుడిసెలు వేసుకుని పోరాడుతుండగా తహసీల్దార్ శ్రీనివాస్ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. గుడిసెలు తొలగించేందుకు యత్నించగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. గుడిసె వాసులకు, రెవెన్యూ అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. రెండు, మూడు గుడిసెలను తహసీల్దార్ స్వయంగా తొలగించారు. అక్కడే నివాసం ఏర్పర్చుకొని పోరాడుతున్న గుడిసెవాసులు తమ నివాసా లను ఎందుకు తొలగిస్తున్నారని ఆందోళనకు దిగారు. ఆరు నెలలుగా ఇక్కడే ఉండి పోరాటం చేస్తున్న తమను పట్టించుకుపోగా అన్యాయంగా గుడిసెలను తొలగించడం ఏమిటని నిలదీశారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఆందోళనకా రులతో కొంత దురుసుగా మాట్లాడటంతో అక్కడున్న మహిళలు, ఇతర గుడిసెవాసులు ఇదేం పద్ధతని ప్రశ్నిం చారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసే అధికారం ఎవరిచ్చారని తహసీల్దార్ గుడిసెవాసులతో వాగ్వాదానికి దిగారు. వివాదం పెద్దది కావడంతో అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. వరదల సమయంలో తమ ఇళ్లు మునిగిపోతున్నాయని గత ప్రభుత్వంలో ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, కొత్తగా వచ్చిన ప్రభుత్వంలో సైతం అదే పరిస్థితి ఉందని గుడిసెవాసులు తమ ఆవేదనని వ్యక్తం చేశారు. కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలని పోలీసులు, రెవెన్యూ అధికారులు చెప్పినప్పటికీ ఆందోళన విరమించలేదు. దీంతో తహసీల్దార్ శ్రీనివాస్, పోలీసులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ ఎన్నిక

మొగుళ్లపల్లి, జనవరి 18: అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు పుల్ల ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మంగళపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మంద తిరుపతి, రేణుకుంట్ల చందర్, గౌరవ అధ్యక్షుడిగా సుదమల్ల బాలకిషన్, ప్రధాన కార్యదర్శిగా జనుప మేఘనాథం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నిమ్మల భద్రయ్య, కోశాధికారిగా శనిగరపు శ్రీనివాస్, కార్యదర్శులుగా బొచ్చు ప్రభాకర్, జీడి సంపత్, సహాయ కార్యదర్శిగా శనిగరపు రవికుమార్, ప్రచార కార్యదర్శులుగా కల్లెపల్లి సాంబయ్య, చిలువేరు సదయ్య, సుమన్, గౌరవ సలహాదారులుగా బండారి రవీందర్, రామస్వామి, మంద సుధాకర్, గంగదారి రాజు, సభ్యులుగా మంద విజయ్, బట్టం సదయ్య ఎన్నికయ్యారు.

దళితబంధు లబ్ధిదారుల నిరసన

(5వ పేజీ తరువాయి)

పోసుకొని నిప్పంటించుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్సై వెంకటేశ్వర్లు వచ్చి సముదాయించినా కిందకు దిగిరాలేదు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దళితబంధు నిధుల విడుదలకు కృషిచేస్తామని కలెక్టర్ ద్వారా హామీనిస్తున్నట్టు ఎస్సై చెప్పడంతో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఆందోళన విరమించి కిందకు వచ్చారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. దళితబంధు రెండో విడతలో జిల్లా వ్యాప్తంగా 1,100 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని, వారి ఖాతాలలోకి వెంటనే నిధులు జమ చేయాలని కోగిల మహేష్ డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కర్రి శ్యాంబాబు, పసుల కార్తీక్, గడ్డం భద్రయ్య, కనకం లింగమూర్తి, గజ్జి నగేష్, ల్యాగల రాజు, చంద్రబాబు, శ్రీనివాస్, చింత రాజు, గట్టయ్య, ఎంపెల్లి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 18: టీఎన్జీవో ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను కలెక్టర్ భవేష్ మిశ్రా ఆవిష్కరించారు. సమీకృత కలెక్టరేట్‌లో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి, టీఎన్జీవోల నేతలు దశరథ రామారావు, కేంద్ర నాయకులు హరికృష్ణ, ఠాకూర్ జ్ఞానేశ్వర్ సింగ్, షఫీ అహ్మద్, సురేందర్ రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

- వెంకటాపూర్(రామప్ప) : కల్లుగీత కార్మిక సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని తాళ్లపాడులో ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. లక్ష్మీదేవిపేట సర్పంచ్ గట్టు కుమారస్వామి, సంఘం నాయకులు కోటగిరి సురేందర్, గునిగంటి శోభన్, దొమ్మటి సదయ్య, గట్టు శంకర్, పులి రమేష్, కారుపోతుల సత్యం, పోశాల వీరమల్లు, మూల రత్నాకర్, చర్లపల్లి సతీష్, మునిగాల రాజమౌళి, వెంకటమల్లు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.
- వెంకటాపురం(నూగూరు) : మున్నూరుకాపు సంఘం క్యాలెండర్‌ను మండలకేంద్రంలోని శివాలయం ఆవరణలో ఆవిష్కరించారు. సంఘం భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి ధనపనేని వెంకటేశ్వర్లు పటేల్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. సంఘం మండల అధ్యక్షుడు జక్కుల శ్యామ్, కార్యదర్శి దాసరి నారాయణరావు, నాయకులు కూసం సాంబశివరావు, బెజ్జని పూర్ణ, దేవుడు, సమ్మయ్య, జొన్నల నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.